
సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు
గురువారం ׀ 19 ׀ సెప్టెంబర్ ׀ 2024



సోమశిలలో 50.796 టీఎంసీలు
సోమశిల: జలాశయంలో బుధవారానికి 50.796 టీఎంసీల నీరు నిల్వ ఉంది. పెన్నార్ డెల్టాకు 600, ఉత్తర కాలువకు 5, దక్షిణ కాలువకు 10 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.75,360
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.6,841
మూడు శాతం జీఎస్టీతో	రూ.7,047
నవర (8 గ్రాములు)	రూ.56,368

వాతావరణం
గరిష్టం/కనిష్టం 38.8 /29.2
జిల్లాలో వాతావరణం గురువారం పొడిగానే ఉంటుందని ఆ శాఖ అధికారులు తెలిపారు. బుధవారం గాలిలో తేమ 50 శాతంగా నమోదైంది.

నారా నయా మోసం



నారా.. వంద రోజుల పాలనలో వంద సార్లు నాలుక మడతేశాడు. 'నాయకుడికి పరిపాలనా దక్షత ఉండాలి. రాష్ట్రాన్ని అభివృద్ధి చేసి, సంపద సృష్టించాలి. దాంతో ప్రజలకు సంక్షేమం అందించవచ్చు. ఇది ఆర్థిక వ్యవస్థలో రహస్యం అంటూ ఆర్థిక శాస్త్రవేత్తను మించిన ఉపన్యాసాలిచ్చారు. ఎన్నికలకు ముందు సంపద సృష్టిస్తామంటూ గొప్పలు చెప్పాడు. గెలిచాక.. భయమేస్తోందంటూ బేల మాటలు మాట్లాడుతున్నాడు. 2014 ఎన్నికల్లోనూ సంపద సృష్టిస్తాను.. సంక్షేమ పథకాలు అమలు చేస్తానంటూ ప్రగల్భాలు పలికి హామీలన్నీ ఎగ్గొట్టిన చంద్రబాబు.. ఈ ఎన్నికల్లో అదే రాగం అందుకున్నారు. అప్పట్లోనూ లోటు బడ్జెట్ అంటూ పథకాలకు పంగనామాలు పెట్టారు. తాజాగా సూపర్ సిక్స్ అంటూ ప్రచారం చేసి రాష్ట్రం ఆర్థిక వ్యవస్థ ధ్వంసమైందంటూ కొత్త రాగం అందుకున్నారు. అధికారం చేపట్టి 100 రోజులు దాటిపోయినా.. ఏ పథకం అమలుకు ఇంత వరకు విధివిధానాలు రూపొందించలేదు. ఇంకా రోడ్‌మ్యాప్ అంటూ కల్లబొల్లి కబుర్లు చెబుతున్నారు.

- 100 రోజుల్లో ఒక్క హామీ అమలు చేయని కూటమి ప్రభుత్వం
- జిల్లాలో 4 లక్షల మంది నిరుద్యోగులు ఎదురుచూపులు
- వైఎస్సార్‌సీపీ హయాంలో 33,866 మందికి శాశ్వత ఉద్యోగ, ఉపాధి కల్పన
- 4.10 లక్షల మంది విద్యార్థుల తల్లులకు అందని వందనం
- అన్నదాత సుఖీభవ కోసం ఎదురుచూస్తున్న 2.45 లక్షల మంది రైతులు
- జిల్లాలో 10 లక్షల మంది మహిళలకు రూ.1,500 సాయం

- సూపర్ సిక్స్.. బ్లాక్ బస్టర్ హిట్ అంటూ ప్రచారం
- ఎన్నికలకు ముందు సంపద సృష్టిస్తామంటూ గొప్పలు
- గెలిచాక.. భయమేస్తోందంటూ బేల మాటలు
- వచ్చే ఏడాదిలో అమలుకు రోడ్ మ్యాప్ అంటూ మంత్రుల వ్యాఖ్యలు
- ఈ ఏడాదికి ఏ పథకం అమలయ్యే అవకాశం లేదు

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: సంపద సృష్టిస్తా.. సంక్షేమాన్ని, అభివృద్ధిని అందిస్తానంటూ చంద్రబాబు ప్రగల్భాలు పలికారు. తీరా గెలిచాక అమలు చేయడానికి చేతకాక చేతులెత్తేసి శ్వేతపత్రాల పేరుతో నయా మోసానికి తెగబడ్డాడు. ఎన్నికల్లో గెలవడానికి అలవి కాని హామీలన్నీ ఇచ్చిన చంద్రబాబు అండ్ కూటమి నేతలు 'సూపర్ సిక్స్.. బ్లాక్ బస్టర్ హిట్' అంటూ ప్రచారం చేశారు. అధికారంలోకి వచ్చాక తోకముడుస్తున్నారు. గతంలోనూ అధికారంలోకి వచ్చేందుకు ఇలాంటి హామీలిచ్చి చివరకు లోటు బడ్జెట్ అంటూ చేతులెత్తేశాడు. రూ.వంద కోట్లు ఖజానాలో పెట్టి అధికారం నుంచి చంద్రబాబు దిగిపోతే.. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక.. కరోనా వంటి విపత్తును ఎదుర్కొంటూనే.. రాబడి తగ్గినా.. రూ.లక్షల కోట్లు సంక్షేమాన్ని అందించారు.

- జిల్లాలో దాదాపు 4 లక్షల మంది విద్యావంతులు ఉన్నారు. వీరిలో గత ప్రభుత్వ హయాంలో గ్రామ, వార్డు సచివాలయాల్లో కొలువులు, అవుట్‌సోర్సింగ్ కొలువులు, వలంటీర్లు, ప్రైవేట్ రంగాల్లో అధికారికంగా 33,866 మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించింది. ఇక కొంత మంది అనధికారికంగా కొలువుల్లో ఉన్నారు. ఇక డీఎస్సీ అంటూ చెప్పినా.. ప్రభుత్వ రోడ్ మ్యాప్ ప్రకారం చూస్తే ఈ ఏడాదికి ఉద్యోగాల కల్పన కూడా లేనట్లే కనిపిస్తోంది. ఈ ప్రభుత్వం వచ్చాక వలంటీర్లను సైతం పక్కన పెట్టేసింది. రెగ్యులర్ ఉద్యోగాలు కాకుండా ఇతర ఉద్యోగాల లెక్క ప్రకారం తీసుకున్నా.. దాదాపు 27,500 మందికి గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడం ద్వారా నిరుద్యోగ భృతి కల్పించిందనే చెప్పాలి.
- జిల్లాలో ఒకటో తరగతి నుంచి ఇంటర్ వరకు 4.10 మందికి పైగా విద్యార్థులు ప్రభుత్వ, ప్రైవేట్ రంగ పాఠశాలల్లో చదువుతున్నారు. గత ప్రభుత్వంలో ఇంట్లో ఒక బిడ్డకే పథకం అమలు చేసి.. 2.27 లక్షల మందికి అమ్మఒడి పథకం కింద ఏడాదికి రూ.15 వేల వంతున అందజేసింది. అదే జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలో ఉంటే ఈ ఏడాది కూడా జూన్ నెలలోనే ఆయా కుటుంబాలకు ఈ సాయం కంటే మిన్నగా అందేది. ప్రస్తుత ఈ ప్రభుత్వంలో చూస్తే ఆ శాఖ మంత్రి చెప్పిన ప్రకారం ఈ ఏడాదికి ఈ పథకం అమలు కాదని స్పష్టమైంది.
- జిల్లాలో ఉచిత బస్సు ప్రయాణానికి, నెలకు రూ.1,500 సాయం పొందడానికి సగటున 10 లక్షల మంది అర్హులు ఉన్నట్లు అధికారులు ప్రాథమికంగా అంచనాలు రూపొందించారు. వీరిలో నిత్యం బస్సుల్లో ప్రయాణించే వారిని సగటున లెక్క చూస్తే.. 3 లక్షల మంది ఉంటున్నారు.
- జిల్లాలో అధికారికంగా బీపీఎల్ కింద రేషన్ కార్డులు కలిగిన వారు దాదాపు 7.50 లక్షలకు పైగా ఉన్నారు. కొంత మేర అటూ ఇటూ తగ్గినా.. 7.30 లక్షల కుటుంబాలకు ఏడాదికి 3 గ్యాస్ సిలిండర్లు చొప్పున పంపిణీ చేయాల్సి ఉంటుంది.
- జిల్లాలో గత ప్రభుత్వం లెక్కల ప్రకారం 2.45 లక్షల మంది రైతులకు కౌలు రైతులతో కలిపి రైతు భరోసా పథకాన్ని అమలు చేసింది. కూటమి ప్రభుత్వం వీరికి రూ.20 వేల వంతున ఇస్తామని హామీ ఇచ్చింది. వీరికి ఇంత వరకు ఈ పథకాన్ని అమలు చేయడానికి ఎలాంటి విధివిధానాలు అమలు చేయలేదు. అదే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఏటా మే నెలలోనే ఈ పథకం సాయం అందించింది.

తల్లికి వందనం
లబ్ధిదారులు 4,10,779
అందించాల్సిన లబ్ధి రూ.616,16,85,000

అన్నదాత సుఖీభవ
లబ్ధిదారులు 2,44,757
అందించాల్సిన లబ్ధి రూ.489,51,40,000

నిరుద్యోగ భృతి
లబ్ధిదారులు 4,00,000
అందించాల్సిన లబ్ధి రూ.120,00,00,000

మహిళకు రూ.1500
లబ్ధిదారులు 10,00,000
అందించాల్సిన లబ్ధి రూ.150,00,00,000

గ్యాస్ ఉచితం పథకం
లబ్ధిదారులు 7,33,520
అందించాల్సిన లబ్ధి రూ.176,04,48,000

ఉచిత బస్సు పథకం
లబ్ధిదారులు 9,93,010



అమ్మఒడి
ఏడాదికి లబ్ధిదారులు: 2,26,205
చేకూర్చిన లబ్ధి రూ.339,30,75,000
ఐదేళ్లలో లబ్ధిదారులు: 11,17,154
చేకూర్చిన లబ్ధి రూ.1,675,73,10,000

రైతు భరోసా
ఏడాదికి లబ్ధిదారులు: 2,44,757
చేకూర్చిన లబ్ధి రూ. 330.42 కోట్లు
ఐదేళ్లల్లో లబ్ధిదారులు: 11,49,143
చేకూర్చిన లబ్ధి రూ.రూ. 1,551.32 కోట్లు

ఉద్యోగ కల్పన
లబ్ధిదారులు: 27,543

మహిళలకు సాయం
ఆసరా : 3,24,899 మంది
ఏడాదికి: రూ. 999,49,80,305
చేదోడు : 21,071
ఏడాదికి: రూ. 44,39,00,000
ఈబీసీ నేస్తం : 31,706
ఏడాదికి: రూ. 86,35,50,000
కాపు నేస్తం : 9,281
ఏడాదికి: రూ. 37,97,70,000
వైఎస్సార్ చేయూత : 1,47,975
ఏడాదికి: రూ. 647,36,62,000
వైఎస్సార్ సున్నా వడ్డీ : 4,63,993
ఏడాదికి: రూ. 188,42,15,254
గృహ నిర్మాణం: 49,792
రూ. 471,92,,86,592
ఇంటి స్థలాలు : 92,597
రూ. 2,277,88,62,000

ఐదేళ్లూ సంక్షేమ సంతకం



వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన ఐదేళ్ల పరిపాలనలో సంక్షేమాన్ని ఇంటి తలుపు తట్టి అందించింది. ప్రతి పథకానికి క్యాలెండర్ ఏర్పాటు చేసి అదే రోజు లబ్ధిదారుల ఖాతాల్లో ఆర్థిక ప్రయోజనాలు జమ చేశారు. ఏ పథకం కోసం ఎవరి చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండానే నేరుగా వలంటీర్ల వ్యవస్థను ఏర్పాటు చేశారు. పార్టీ చూడలేదు. కులం, మతం , ప్రాంతం చూడలేదు. అర్హతే ప్రామాణికంగా తీసుకుని ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందించడం ద్వారా ఆయా కుటుంబాలు ఆర్థికంగా నిలదొక్కుకున్నాయి. జిల్లాలో డీబీటీ, నాన్ డీబీటీ రూపంలో 31 పథకాల కింద రూ.వేల కోట్లు అందించారు.



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అదనపు పథకాల ద్వారా లబ్ధి

పథకం	లబ్ధిదారులు	చేకూరిన లబ్ధి (ఏడాది)
వైఎస్సార్ పింఛన్ కానుక	3,16,001	రూ.216 కోట్లు (నెలకు)
కోవిడ్ సాయం	6,11,230	రూ.61.12 కోట్లు
పంటల బీమా	6,587	రూ.8.60 కోట్లు
రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ	30,688	రూ.31.43 కోట్లు
మత్స్యకార భరోసా	19,329	రూ.58.00 కోట్లు
నేతన్న నేస్తం	5,131	రూ.41.91 కోట్లు
వాహన మిత్ర	22,105	రూ.62.71 కోట్లు
జగనన్న వసతి దీవెన	1,25,894	రూ.218.92 కోట్లు
జగనన్న విద్యాదీవెన	1,59,577	రూ.570.09 కోట్లు

ఇవి కాక వైఎస్సార్ ఆరోగ్యశ్రీ, ఆరోగ్య ఆసరా, కళ్యాణమస్తు, సున్నా వడ్డీ పంట రుణాలు, జగనన్న తోడు (వడ్డీ), వైఎస్సార్ బీమా, విద్యార్థులకు విద్యాకానుక, గోరుముద్ద, వైఎస్సార్ సంపూర్ణ పోషణ, ట్యాబ్‌లు తదితర పథకాల ద్వారా ఏడాదికి రూ.కోట్లల్లో ఖర్చు చేశారు.



రూ.1500 నగదు ఇవ్వాలి



టీడీపీ కూటమి మేనిఫెస్టోలో ప్రతి మహిళకు నెలకు రూ.1,500 వంతున జమచేయనున్నట్లు ప్రకటించారు. సభలు, సమావేశాలతో పాటు ఎన్నికల ప్రచారంలో భాగంగా ఇళ్లకు వచ్చినప్పుడు కూడా ఈ విషయాన్నే ప్రధానంగా చెప్పారు. గెలిచిన వెంటనే సూపర్ సిక్స్ పేరుతో పథకాలన్నీ అమలు చేస్తామని నమ్మించారు. ఇప్పటి వరకు ఆ ఊసే లేదు. మోసం చేయకుండా మహిళల ఖాతాల్లో నగదు జమచేయాలి.
–జరీనా, బిట్రగుంట

ఫ్రీ బస్సు భాగ్యం ఎప్పుడో



టీడీపీ కూటమి ఎన్నికల మేనిఫెస్టోలో మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తామని హామీ ఇచ్చారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఫ్రీ బస్సు భాగ్యం ఎప్పుడా అని ఎదురు చూస్తున్నాం. అయితే కొత్త ప్రభుత్వం దాని గురించి ఎలాంటి ప్రకటన చేయకపోవడంతో హామీని గాలికొదిలేశారా అనే అనుమానం కలుగుతోంది.
– నల్లిపోగు భాగ్యమ్మ, డీసీపల్లి, మర్రిపాడు మండలం

మూడు గ్యాస్ సిలిండర్లెక్కడ..?



ప్రతి ఇంటికీ మూడు గ్యాస్ సిలిండర్లను ఉచితంగా ఇస్తామని గత ఎన్నికల సమయంలో చంద్రబాబు వాగ్దానం చేశారు. అయితే ప్రస్తుతం ఆ ఊసే ఎత్తడంలేదు. అసలు ఈ పథకాన్ని అమలు చేస్తారాననే సందేహం కలుగుతోంది. – జ్యోతి, నెల్లూరు

బస్సులో ఉచిత ప్రయాణమెప్పుడు



టీడీపీ అధికారంలోకి వస్తే ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణమని టీడీపీ హామీ ఇచ్చింది. అసలు దీనిపై ఇంత వరకు ఎలాంటి ప్రకటన చేయలేదు. ఏ విధంగా ఉచితంగా బస్సు ప్రయాణం కల్పిస్తారో తెలపలేదు. కర్ణాటక, తెలంగాణలో అధికారంలోకి వచ్చిన వెంటనే ఆ ప్రభుత్వాలు అమలు చేశాయి. – మౌనికారెడ్డి, నెల్లూరు

సూపర్ సిక్స్ పెద్ద మోసం



సూపర్ సిక్స్ పథకాలు పెద్ద మోసం. అబద్ధాలు చెప్పడం చంద్రబాబుకు అలవాటు. అలవికాని హామీలు ఇవ్వడం, అమలు చేయలేక సాకులు చెప్పడం గతంలోనూ జరిగింది. గెలుపు కోసం సూపర్ సిక్స్ అంటూ అమలు చేయలేని హామీలతో అబద్ధాలు చెప్పి, ఓట్లు వేయించుకున్నారు.
– కె.లక్ష్మణరెడ్డి, రైతు, ముత్తుకూరు

రూ.30 వేలు రావాలి



చంద్రబాబు అధికారంలోకి వస్తే చదువుకునే పిల్లలందరికీ రూ.15 వేలు ఇస్తామని చెప్పారు. మా ఇద్దరు బిడ్డలను ప్రభుత్వ పాఠశాలలో చదివిస్తున్నా. ప్రస్తుతం రూ.30 వేలు రావాల్సి ఉంది. అయితే ఇప్పటివరకు ఎలాంటి సాయం అందలేదు. ఇచ్చిన మాట ప్రకారం తల్లికి వందనం అమలు చేయాలి.
– ఎస్.విజయలక్ష్మి, కోవూరు

నిరుద్యోగ భృతి ఊసేలేదు



ఎన్నికలకు ముందు ఇచ్చిన ఏ హామీని అమలు చేయడం లేదు. ఉద్యోగం లేని వారికి నిరుద్యోగ భృతి ఇస్తామన్నారు. తీరా ఎన్నికల్లో గెలిచిన తర్వాత ఆ ఊసే లేదు. ఇంకా దానిపై కనీసం అసెంబ్లీ చర్చించలేదు. కేబినెట్‌లో ప్రస్తావించలేదు. ఓటాన్ బడ్జెట్‌లో ప్రవేశ పెట్టలేదు. చంద్రబాబు మోసం చేశాడు. ఉద్యోగాలు దొరకడం కష్టంగా ఉంది. చంద్రబాబు చెప్పేదొకటి.. చేసేదొకటి. ప్రజలను బురిడీ కొట్టించడంలో బాబు దిట్ట. ఇక నిరుద్యోగ భృతి మీద ఆశ వదులుకున్నాను.
– ఎస్‌కే షఫీ, నెల్లూరు సిటీ

ఉచిత బస్సు సౌకర్యం కల్పించాలి



కర్ణాటక, తెలంగాణలో మాదిరి రాష్ట్రంలో కూడా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తామని ఎన్నికలకు ముందు టీడీపీ కూటమి హామీ ఇచ్చింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో చిరుద్యోగాలు, వ్యాపారాలు చేసుకునే మహిళలు బస్సు చార్జీలు కలిసి వస్తాయని ఆశగా ఎదురుచూస్తున్నారు. విధివిధానాల అధ్యయనం పేరుతో కాలయాపన చేయకుండా ఉచిత బస్సు సౌకర్యాన్ని వెంటనే కల్పించాలి. –పోలమ్మ, బిట్రగుంట

రైతుల ఉసురు తగులుతుంది



పది మందికి అన్నం పెట్టే రైతన్నకు ఇచ్చిన మాట తప్పితే ఆ ఉసురు చంద్రబాబుకు తగులుతుంది. ఇచ్చిన హామీ మేరకు అన్నదాత సుఖీభవ పథకాన్ని అమలు చేయాలి. సీజన్ ప్రారంభం అవుతున్నందున దుక్కి, విత్తనాలు సిద్ధం చేసుకోవాల్సి ఉంది. రైతులకు ఆర్థిక సాయం అందజేయాల్సిన ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణం. రూ.20వేలు నగదు సాయాన్ని వెంటనే జమ చేయాలి.
– ఆర్ నరసింహారెడ్డి, వెన్నవాడ, ఆత్మకూరు

మాట నిలబెట్టుకోవాలి..



టీడీపీ కూటమి ఎన్నికల మేనిఫెస్టోలో 18 నుంచి 59 ఏళ్లలోపు మహిళలకు నెలకు రూ.1500 అందజేస్తామని చెప్పడంతో నమ్మి ఓట్లేశాం. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో నగదు ఎప్పుడిస్తారాని ఎదురు చూస్తున్నాం. వెంటనే నగదు అందజేసి మహిళలకిచ్చిన మాట నిలబెట్టుకోవాలి.
–దావులూరు జయమ్మ,కొండాపురం

రైతులకు భరోసా కల్పించాలి



గత ప్రభుత్వ హయాంలో ఏటా సచివాలయ సిబ్బంది ఇంటికే వచ్చి రైతుల వివరాలు నమోదు చేసుకునే వారు. రైతుభరోసా పథకం కింద రైతుల ఖాతాల్లో క్రమం తప్పకుండా నగదు జమయ్యేది. కొత్తగా లబ్దిదారుల ఎంపిక చేయాల్సిన అవసరం ఏముంది. కొత్త ప్రభుత్వం ఇప్పటి వరకు అన్నదాత సుఖీభవ పథకంపై ఎటువంటి ప్రకటన చేయకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పెట్టుబడి సాయం ఎప్పుడిస్తారో, ఎవరిని సంప్రదించాలో అర్థం కావడం లేదు.
–రఫీ, కావలి

ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే చర్యలు

సాక్షి ఎఫెక్ట్..

మర్రిపాడు: మండలంలో ఎవరైనా ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దారు స్వప్న హెచ్చరించారు. బుధవారం 'సాక్షి'లో 'ప్రభుత్వ భూమి ఆక్రమణకు యత్నాలు' శీర్షికన ప్రచురితమైన కథనానికి తహసీల్దార్ స్పందించారు. కంపసముద్రంలో ఆక్రమణకు యత్నిస్తున్న పొలంలో హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు. తహసీల్దారు మాట్లాడుతూ ప్రభుత్వ భూములు ఆక్రమణలకు గురికాకుండా ఎప్పటికప్పుడు గ్రామస్తులు తమకు సహకారం అందించాలని కోరారు. రెవెన్యూ యంత్రాంగం ప్రభుత్వ భూములను కాపాడేందుకే ఉందన్నారు. ఆమె వెంట ఆర్‌ఐ సురేంద్ర, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.



టీడీపీ నేతలు ఆక్రమించిన భూమిలో హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేస్తున్న తహసీల్దార్

జ్వరాల నియంత్రణకు లార్వా సర్వే

నెల్లూరు (అర్బన్): జిల్లాలో విష జ్వరాలు, ఇతర కీటక జనిత జ్వరాల నివారణకు ఏఎన్‌ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీల ద్వారా ప్రతి రెండు వారాలకోసారి ఫీవర్ సర్వే చేపడుతున్నామని డీఎంహెచ్‌ఓ పెంచలయ్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ రాష్ట్ర కమిషనర్‌కు వివరించారు. బుధవారం ఆరోగ్యశాఖ కమిషనర్ హరికిరణ్ విజయవాడ నుంచి జ్వరాల నియంత్రణపై ఆరోగ్యశాఖాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లా వైద్యశాఖ కార్యాలయం నుంచి డీఎంహెచ్‌ఓ, ఇతర ప్రోగ్రాం ఆఫీసర్లు వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. డీఎంహెచ్‌ఓ పెంచలయ్య మాట్లాడుతూ జ్వరాల ఉధృతి తగ్గించడానికి గ్రామాల్లో అధికారుల సమన్వయంతో పారిశుధ్య కార్యక్రమాలు మెరుగు పరిచేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. ప్రైవేట్ ఆస్పత్రుల్లో సైతం జబ్బులను గుర్తించి వాటిని ఆన్‌లైన్‌లో నమోదు చేసేలా సమీక్షలు జరుపుతున్నట్టు తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అడిషనల్ డీఎంహెచ్‌ఓ ఖాదర్‌వలీ, డీఐఓ డాక్టర్ ఉమామహేశ్వరి, ఎఫ్‌పీసీ నోడల్ ఆఫీసర్ డాక్టర్ దయాకర్, డీపీఎంఓ డాక్టర్ రమేష్, ఎన్‌సీడీ పీఓ డాక్టర్ సుధీర్‌కుమార్, డీఎస్‌ఓ డాక్టర్ భాస్కర్, డెమో అధికారి కనకరత్నం, డీపీహెచ్‌ఎన్‌ఓ మంజుల, ఏఎంఓ నాగార్జునరావు తదితరులు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ పెంచలయ్య

సోమశిల గేట్ల లీకేజీకి మరమ్మతులు

సోమశిల: సోమశిల జలాశయం ప్రాజెక్ట్ గేట్ల లీకేజీలను అరికట్టేందుకు బుధవారం మరమ్మతులు ప్రారంభించారు. నాగార్జునసాగర్ డ్యాం నుంచి అండర్ వాటర్ డైవర్స్ టీం మంగళవారం జలాశయానికి చేరుకున్న విషయం తెలిసిందే. బుధవారం ప్రాజెక్ట్‌లోని 17, 18 రివర్స్ స్లూయిజ్, 11 క్రస్ట్‌గేట్ నుంచి వస్తున్న లీకేజీలను గుర్తించారు. ఇప్పటికే 80 శాతం పూర్తి చేశామని, మిగిలిన పనులను గురువారం పూర్తి చేస్తామని జలాశయం అధికారులు డీఈ రవీంద్రప్రసాద్, జేఈ రామ్మోహన్‌రెడ్డి తెలిపారు.

క్లుప్తంగా

స్వర్ణాల చెరువులో మహిళ మృతదేహం

నెల్లూరు(క్రైమ్): స్వర్ణాల చెరువులో ఓ వివాహిత మృతదేహం లభ్యమైంది. పోలీసుల సమాచారం మేరకు ఖుద్దూస్‌నగర్‌కు చెందిన షేక్ వహాబ్, హసునోరా(29) దంపతులు. గత కొద్దిరోజులుగా దంపతుల నడుమ విభేదాలు జరుగుతున్నాయి. మూడురోజుల కిందట దంపతుల నడుమ వాగ్వివాదం జరిగింది. అప్పటి నుంచి హసునోరా అదృశ్యమైంది. బాధిత కుటుంబ సభ్యులు చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేయగా గాలింపు చర్యలు చేపట్టారు. ఈ నేపథ్యంలో బుధవారం బారాషహీద్ దర్గా సమీపంలోని స్వర్ణాల చెరువులోని చెట్లపొదల్లో ఆమె మృతదేహం చిక్కుకుని ఉంది. స్థానికులు 112కు ఫోన్ చేసి సమాచారం అందించగా దర్గామిట్ట పోలీసులు మృతదేహాన్ని వెలికితీశారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

ప్రేమోన్మాది బరితెగింపు

- యువతిపై అత్యాచారయత్నం.. అనంతరం ఆత్మహత్యాయత్నం

వలేటివారిపాళెం: ఓ ప్రేమోన్మాది తాను ప్రేమించిన యువతి వెంట పడి వేధించాడు. ఆవారాగా తిరిగే అతన్ని ఆమె తిరస్కరించింది. దీంతో ఆమెను కత్తితో బెదిరించి అత్యాచారయత్నం చేసి.. తన గొంతుకుని ఆత్మహత్యాయత్నం చేశాడు. ఈ ఘటన వలేటివారిపాళెం మండలంలోని బంగారక్కపాళెంలో మంగళవారం జరిగింది. స్థానికుల సమాచారం మేరకు.. బంగారక్కపాళెం గ్రామానికి చెందిన పి.రామకృష్ణ (30) డిగ్రీ వరకు చదివాడు. గ్రామంలోనే ఏ పని లేకుండా ఖాళీగా తిరగడం అలవాటు చేసుకున్నాడు. అదే గ్రామానికి చెందిన ఒక యువతి ఎంసీఏ పూర్తి చేసి హైదరాబాద్‌లో ఒక సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగం చేస్తుండగా.. ఆమెను ప్రేమ పేరుతో వేధించడం మొదలు పెట్టాడు. అతన్ని ఆమె తిరస్కరించింది. ఈ నేపథ్యంలో బంగారక్కపాళెంలో తిరునాళ్లు జరుగుతుండడంతో ఆ యువతి ఈ నెల 13న స్వగ్రామానికి వచ్చింది. మంగళవారం ఆమె కుటుంబ సభ్యులు గుడికి వెళ్లడాన్ని గమనించిన ఆ యువకుడు ఆమె ఇంట్లో చొరబడి తనను పెళ్లి చేసుకోవాలని కత్తితో బెదిరించి అత్యాచారానికి యత్నించాడు. ఆమె కేకలు వేయడంతో స్థానికులు రక్షించారు. దీంతో తన ఛాతి, మెడపై కత్తితో పొడుచుకుని తీవ్రంగా గాయపడ్డాడు. ఈ క్రమంలో యువతి తల్లిదండ్రులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఇద్దరిని కందుకూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించడంతో చికిత్స పొందుతున్నారు.

జిల్లా వైఎస్సార్‌సీపీలో పటిష్ట టీమ్



తాడేపల్లిలో మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డితో జిల్లాకు చెందిన మాజీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, నాయకులు

- కందుకూరు సహా ఉమ్మడి జిల్లా అధ్యక్షుడిగా కాకాణి గోవర్ధన్‌రెడ్డి
- నెల్లూరు పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకుడిగా ఆదాల ప్రభాకర్‌రెడ్డి
- నెల్లూరు సిటీ సమన్వయకర్తగా ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖరరెడ్డి
- నెల్లూరు రూరల్ సమన్వయకర్తగా డీసీసీబీ మాజీ ఛైర్మన్ ఆనం విజయకుమార్‌రెడ్డి
- నెల్లూరు నగరపాలక పార్టీ పరిశీలకుడిగా మాజీమంత్రి అనిల్‌కుమార్‌యాదవ్
- రాష్ట్ర మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శిగా ఖలీల్ అహ్మద్

నెల్లూరు (బారకాసు): జిల్లాలో వైఎస్సార్‌సీపీలో కొత్త జోష్ నింపుతూ పటిష్టమైన టీమ్‌ను ఆ పార్టీ అధిష్టానం ప్రకటించింది. బుధవారం తాడేపల్లిలో జిల్లాలోని మాజీ ఎమ్మెల్యేలు, మాజీ ఎంపీలు, ఎమ్మెల్సీలు, నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జిలు, ముఖ్య నేతలతో వైఎస్సార్‌సీపీ జాతీయ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమావేశం నిర్వహించారు. భవిష్యత్ కార్యాచరణ ప్రణాళికలు, వ్యూహాలపై కులంకషంగా చర్చించారు. ప్రతి అడుగు ప్రణాళికాత్మకంగా ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా పార్టీ బలోపేతానికి సంబంధించి పలు నియోజకవర్గాలకు బాధ్యతలను అప్పగించారు. కందుకూరు నియోజవర్గం సహా ఉమ్మడి నెల్లూరు జిల్లా పార్టీ అధ్యక్షుడిగా మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, నెల్లూరు పార్లమెంట్ నియోజకవర్గ పార్టీ పరిశీలకుడిగా మాజీ నెల్లూరు పార్లమెంట్ సభ్యుడు ఆదాల ప్రభాకర్‌రెడ్డి నియమితులయ్యారు. నెల్లూరు సిటీ అసెంబ్లీ నియోజకవర్గ సమన్వయకర్తగా ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖరరెడ్డి, నెల్లూరు రూరల్ అసెంబ్లీ నియోజకవర్గ సమన్వయకర్తగా డీసీసీబీ మాజీ ఛైర్మన్ ఆనం విజయ్‌కుమార్‌రెడ్డిని, నెల్లూరు కార్పొరేషన్ స్థాయిలో పార్టీ పరిశీలకుడిగా మాజీ మంత్రి డాక్టర్ పోలుబోయిన అనిల్‌కుమార్‌యాదవ్, రాష్ట్ర మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శిగా మాజీ డిప్యూటీ మేయర్ మహ్మద్ ఖలీల్ అహ్మద్‌ను నియమిస్తూ కేంద్ర కమిటీ ప్రకటన విడుదల చేసింది.

మూడు స్టాక్ పాయింట్ల ద్వారా నేటి నుంచి ఇసుక విక్రయాలు

నెల్లూరు సెంట్రల్: జిల్లాలోని మూడు స్టాక్ పాయింట్ల ద్వారా ఇసుక విక్రయాలను నిర్వహిస్తున్నట్లు మైనింగ్ శాఖ అధికారి శ్రీనివాసకుమార్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గురువారం మధ్యాహ్నం 3 గంటల నుంచి విక్రయాలు ప్రారంభిస్తామని తెలిపారు. సంగం, సూరాయపాళెం, నెల్లూరు సమీపంలోని పొట్టేపాలెం ప్రాంతాలలోని స్టాక్ పాయింట్ల నుంచి సరఫరా చేయనున్నట్లు తెలిపారు.

నిమ్మధరలు (కిలో)

పెద్దవి : రూ.100

సన్నవి : రూ.50

పండ్లు : రూ.35



దివ్యాంగులకు నైపుణ్య అభివృద్ధి కేంద్రం సేవలు

- కలెక్టర్ ఆనంద్

వెంకటాచలం: దివ్యాంగులు నైపుణ్య అభివృద్ధి, పునరావాస కల్పన, సాధికారిత సమ్మిళిత ప్రాంతీయ కేంద్రం (సీఆర్‌సీ) సేవలను సద్వినియోగపరుచుకోవాలని కలెక్టర్ ఆనంద్ పిలుపునిచ్చారు. మండలంలోని అనుపల్లిపాడు సమీపంలోని సీఆర్‌సీ కేంద్రాన్ని కలెక్టర్ బుధవారం సందర్శించారు. ఈ కేంద్రంలో దివ్యాంగులు తమ నైపుణ్యాలతో తయారు చేసిన వివిధ రకాల వస్తువులను, ఒకేషనల్ ట్రైనింగ్ సెంటర్, డేటా ఎంట్రీ కోర్సు శిక్షణ, టైలరింగ్ మొదలైన వృత్తి నైపుణ్యాలను కలెక్టర్ స్వయంగా పరిశీలించారు. కేంద్రంలోని ఫిజియోథెరఫీ, స్పెషల్ ఎడ్యుకేషన్ వర్చువల్ రియాలిటీ తదితర గదులను పరిశీలించి, కేంద్రం పని తీరును కేంద్రం ఇన్‌చార్జి డైరెక్టర్ జి.రామాంజులుతో చర్చించారు. కలెక్టర్ ఆనంద్ మాట్లాడుతూ అత్యాధునిక వసతులతో సీఆర్‌సీలో దివ్యాంగులకు సేవలు అందుతున్నాయని, వాటిని సద్వినియోగపరుచుకోవాలని సూచించారు. సీఆర్‌సీకి చేరుకునేందుకు బస్సు సౌకర్యాన్ని మెరుగు పరిచేందుకు చర్యలు చేపడతామని వివరించారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ శ్రీనివాసులు, దివ్యాంగుల సంక్షేమశాఖ ఏడీ వినయ్ కుమార్ పాల్గొన్నారు.



సీఆర్‌సీలో వసతులపై చర్చిస్తున్న కలెక్టర్ ఆనంద్

లాడ్జిలో వ్యక్తి మృతి

నెల్లూరు(క్రైమ్): లాడ్జిలో వ్యక్తి మృతిచెందిన సంఘటన బుధవారం వెలుగులోకి వచ్చింది. పోలీసుల సమాచారం మేరకు బెంగళూరుకు చెందిన వెంకటసూర్యనారాయణ(48) అవివాహితుడు. గతంలో ఆయన హైదరాబాద్‌లో ప్రైవేటు ఉద్యోగం చేశారు. కొన్నేళ్లుగా ఉద్యోగం మానేసి ఇంటి వద్దనే ఉంటున్నారు. ఆయన స్వస్థలం నెల్లూరు కావడంతో అప్పుడప్పుడు నెల్లూరుకు వచ్చివెళ్లేవాడు. ఈ నేపథ్యంలో గత నెల 21వ తేదీన ఆయన నెల్లూరుకు వచ్చి ఆర్టీసీ బస్టాండు సమీపంలోని హోటల్‌లో గదిని తీసుకున్నారు. అప్పటి నుంచి లాడ్జిలోనే ఉంటూ నిత్యం మద్యం తాగుతున్నాడు. మంగళవారం గది నుంచి బయటకు రాలేదు. బుధవారం లాడ్జి సిబ్బందికి అనుమానం వచ్చి తలుపులు తట్టగా లోపల నుంచి ఎలాంటి అలికిడి లేదు. దీంతో లాడ్జి మేనేజర్ రాజా, సిబ్బంది మారుతాళంతో గది తలుపులు తెరచి చూడగా సూర్యనారాయణ మంచంపై చనిపోయి ఉన్నాడు. ఈ మేరకు మేనేజర్ రాజా చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేయగా ఇన్‌స్పెక్టర్ చిట్టెం కోటేశ్వరరావు, ఎస్‌ఐ అయ్యప్పలు మృతదేహాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. ఎస్‌ఐ అయ్యప్ప కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ కానిస్టేబుల్ మృతి



వైద్యశాలలో రమేష్ మృతదేహం



కానిస్టేబుల్ రమేష్ (ఫైల్)

సంగం : అప్పుల ఊబిలో కూరుకుపోయి ఆత్మహత్యాయత్నం చేసిన కానిస్టేబుల్ నెల్లూరులో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. ఏఎస్‌పేట పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ రమేష్ పడమటిపాళెంలో తాను సాగు చేస్తున్న పొలంలో పంటంతా గతంలో వచ్చిన వర్షాలకు దెబ్బతినింది. దీంతో అప్పులు తీర్చలేక మనస్తాపానికి గురై బుధవారం పడమటిపాళెం వద్ద పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన విషయం విదితమే. విడవలూరు మండలానికి చెందిన రమేష్ బీఎస్సీ కంప్యూటర్స్ చదివి 2012లో కష్టపడి పోలీస్ ఉద్యోగం పొందాడు. 2013లో పడమటిపాళెం గ్రామానికి చెందిన నిరోషతో వివాహమైంది. అతనికి కుమార్తె నివేదిత, కుమారుడు సాత్విక్ ఉన్నారు. చిన్న వయస్సులోనే రమేష్ మృతి చెందడంతో ఆ కుటుంబం వీధిన పడింది. రమేష్ మృతి జీర్ణించుకోలేని కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. వారిని ఓదార్చడం ఎవరి వల్ల కాలేదు. నెల్లూరులో పోస్ట్‌మార్టం అనంతరం సొంతూరు విడవలూరులో రమేష్ మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించారు. సంగం సీఐ వేమారెడ్డితో పాటు సిబ్బంది అంత్యక్రియల్లో పాల్గొన్నారు. సంగం పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

జిల్లా రిజిస్ట్రార్ బాలాంజనేయులు బదిలీ

నెల్లూరు సిటీ: నెల్లూరు జిల్లా స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ అధికారి బాలాంజనేయులును బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సిసోడియా బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆయనను ప్రకాశం జిల్లా రిజిస్ట్రార్‌గా బదిలీ చేశారు. ఆయన స్థానంలో ప్రస్తుతానికి ఎవరినీ నియమించలేదు.



అధికారులకు అసలు సిగ్గుందా?

- సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి వివాదాస్పద వ్యాఖ్యలు



మాట్లాడుతున్న సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి

నెల్లూరు సిటీ: గత ప్రభుత్వంలో ప్రకృతి వనరులను దోచుకున్న వారిని వదిలేసి అమాయకులపై కేసులు పెడుతున్నారని, అధికారులకు అసలు సిగ్గుందా అంటూ సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అధికారులపై మండిపడ్డారు. నెల్లూరులోని టీడీపీ కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జిల్లాలోని 14 రీచ్‌ల్లో రెండేళ్ల కాలంలో రూ.332 కోట్ల విలువైన ఇసుక చోరీకి గురైందని అధికారులు విచారణలో తేల్చారన్నారు. పొదలకూరు మండలం విరువూరుకు సంబంధించి టన్ను ఇసుకకు రూ.2 వేలు లెక్కగట్టి రూ.37 కోట్లు పెనాల్టీ విధించారు. ఇక్కడ దోపిడీ చేసిన వారిని వదిలేసి ఎవరిపైనో కేసులు పెట్టి చేతులు దులుపుకుంటారా? అంటూ అధికారులపై రుసరుసలాడారు. వరదాపురం, మరుపూరు, మొగళ్లూరు తదితర గ్రామాల్లో వందల కోట్ల విలువైన క్వార్ట్జ్ దోపిడీకి గురైతే అసలోళ్లను వదిలేసి యల్లయ్య, పుల్లయ్యపై కేసు పెడతామనడం దుర్మార్గమన్నారు. ఇసుక, క్వార్ట్జ్‌ను దోచేసిన వారిపై కేసులు నమోదు చేయకపోతే మరో సత్యాగ్రహం చేపట్టాల్సి ఉంటుందని హెచ్చరించారు.

మూడున్నర కిలోల గంజాయి స్వాధీనం

కావలి: పట్టణంలోని బుడమగుంట కాలనీలో నిర్మాణంలో ఉన్న ఒక గృహంలో మూడున్నర కిలోల గంజాయిని బుధవారం స్వాధీనం చేసుకున్నట్లు కావలిరూరల్ పోలీస్ స్టేషన్ సీఐ జి.రాజేశ్వరరావు చెప్పారు. గంజాయి అక్రమ విక్రయాలకు సంబంధించి సమాచారం అందడంతో ఆ ప్రాంతంలో తనిఖీలు చేపట్టామన్నారు. అయితే ఎవరు గంజాయికి సంబంధీకులనేది తెలియలేదు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు. త్వరలోనే నిందితులను పట్టుకుంటామన్నారు.

జిల్లా ఆడిట్ రిజిస్ట్రార్ బదిలీ

నెల్లూరు సిటీ: స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ డిపార్ట్‌మెంట్‌లో జిల్లా ఆడిట్ రిజిస్ట్రార్ హరివర్మను అన్నమయ్య జిల్లా రాయచోటికు బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన స్థానంలో విజయనగరంలోని ఆడిట్ రిజిస్ట్రార్‌గా విధులు నిర్వహిస్తున్న ఏవీ కుమారిని నియమించారు.

బైక్‌లు ఢీకొని మహిళ మృతి

దుత్తలూరు: రెండు బైక్‌లు ఢీకొని ఓ మహిళ మృతి చెందిన ఘటన దుత్తలూరు సెంటర్ సమీపంలో బుధవారం రాత్రి చోటు చేసుకుంది. వింజమూరు మండలం చాకలికొండకు చెందిన మాధవి (40) తన కుమారుడు పవన్‌తో కలిసి మర్రిపాడులో జరుగుతున్న ఓ శుభకార్యానికి బైక్‌పై బయలుదేరింది. ఈ క్రమంలో దుత్తలూరు సెంటర్ సమీపంలోని లారీ కాటా వద్ద ముందు వెళ్తున్న స్కూటీ ఒక్కసారిగా ఆగడంతో వెనుకగా బలంగా ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో మాధవి రోడ్డుపై పడడంతో తలకు తీవ్రగాయమై అక్కడికక్కడే మృతి చెందింది. మిగిలిన వారికి ఎలాంటి గాయాలు కాలేదు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉదయగిరి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఎస్సై ఆదిలక్ష్మి కేసు దర్యాప్తు చేస్తున్నారు.